భూమిలేని కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న కామ్రేడ్ నర్సింహ

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 26: ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో కూలీలకు పనులు లేనందున ఉపాధి హామీ పథకం పనులను చేపట్టాలని కోరారు. గ్రామాల్లో కొత్త పింఛన్లు లేక అర్హులైన వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారని, ఇండ్లు లేని పేదలందరికీ తక్షణమే 5లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం రూ. 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామ్రేడ్ బాలస్వామి, నంది షేట భాస్కర్, సహాయ కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులు సుభాష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్ర పటాన్ని తొలగించడం సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 26: ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగించడం సరికాదని నాయకులు గిద్ద విజయ్ కుమార్ అన్నారు. భారతదేశానికి తలమానిక మైన ఢిల్లీలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాల్సిన అంబేద్కర్ ఫొటో తొలగించడం బీజేపీ అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఢిల్లీ శాసన సభ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ముఖ్యమంత్రి సీటు కైవసం చేసుకుని రెండు రోజుల్లోనే మీ కాషాయ బుద్ధిని, మార్కును ప్రజలందరిపై రుద్దడం సమంజసం కాదన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 26: ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగించడం సరికాదని స్వేరో రాష్ట్ర నాయకులు గిద్ద విజయ్ కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే చిత్రపటం తీసివేయడం వారి సంకుచిత మనస్థత్వాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రపంచ మేధావి చిత్రపటాన్ని తిసివేయడం సహించమని, తిరిగి చిత్రపటాన్ని యదాస్థితిలో పెట్టాలని, లేకపోతే స్వేరో ద్వారా ఆందోళన చేపడుతామని ఆయనన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

● కండ్లను దానం చేసిన కుటుంబ సభ్యులు

ఊట్కూర్, ఫిబ్రవరి 26: మండలకేంద్రంలోని ఈశ్వర్‌మందిర్ కాలనీకి చెందిన మొగులాయి రఘువీర్ (35) ఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి కండ్లను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖానకు దానం చేసినట్లు తెలిపారు. తాను చనిపోతూ మరొకరికి కంటిచూపును ప్రసాదించిన రఘువీర్ మృతిపై పలువురు విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. స్వగ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు.

రఘువీర్ (ఫైల్)

తుప్పుపడుతున్న 104వాహనాలు

మండలంలో తుప్పు పడుతున్న 104 వాహనం

బిజినేపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని పాలెం పీహెచ్‌సీలో 104వాహనాలు తుప్పుపడుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో 104సేవలను ఏర్పాటు చేశారు. ప్రతి పల్లెకు ఈ మొబైల్ వాహనాలను తిప్పుతూ సేవలందిస్తుంటారు. ప్రస్తుతం 104వాహనాల నిర్వహణ జరగకపోవడంతో గ్రామీణ ప్రజలకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ వాహనాలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో వినియోగించకపోవడంతో దవాఖానల్లోని నిలిపి ఉంచడంతో తుప్పుపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అందుబాటులోకి తేవాలన్నారు.

భవానీమాత ఆలయంలోకి ఆకతాయి

● పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు
● నిందితుడి రిమాండ్: సీఐ గాంధీనాయక్

నవాబుపేట, ఫిబ్రవరి 26: మండలంలోని కొల్లూరు భవానీమాత ఆలయంలోకి మంగళవారం రాత్రి ఒక ఆకతాయి(అన్యమతస్తుడు) ప్రవేశించి చిల్లర పనులు చేయడంతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే.. రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన ఒక యువకుడు మంగళవారం రాత్రి కొల్లూరులోని భవానీమాత ఆలయంలోకి ప్రవేశించి..అమ్మవారి విగ్రహంపై ఉన్న చీరలు, గాజులు, పుస్తె తదితర వస్తువులను తొలగించాడు. గమనించిన గ్రామ యువకులు, గ్రామస్తులు అక్కడికి వెళ్లి యువకుడికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న సీఐ గాంధీనాయక్, ఎస్సై విక్రమ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. తాము పవిత్రంగా భావించే అమ్మవారి ఆలయంలోకి ఆకతాయి వెళ్లి..అమ్మవారి గుడిని అపవిత్రం చేశాడంటూ ఆందోళనకు దిగారు. సీఐ గాంధీనాయక్ రంగంలోకి దిగి.. అదే రోజు రాత్రి ఆలయంలో గ్రామపెద్దలతో పూజలు చేయించి అమ్మవారికి నూతనంగా చీరలు, ఇతర వస్తువులతో ముస్తాబు చేయించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అనంతరం ఘటనపై పోలీసులకు గ్రామ యువకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా.. ఆలయంలోకి వెళ్లి చిల్లర పనులు చేసిన యువకుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆకతాయి చేతిలో భవానీమాత మంగళసూత్రం

మద్యపానానికి దూరంగా..

సింగోటం గ్రామ పంచాయతీ కార్యాలయం

కొల్లాపూర్, ఫిబ్రవరి 26 : మండలపరిధిలోని సింగోటం గ్రామంలో మద్యపాన నిషేదానికి దశాబ్ది కాలం పూర్తి అయింది. 2014 నవంబరు 22న సింగోటం గ్రామంలో మద్యపాన నిషేదం పాటిస్తూ గ్రామ యువకులు తీర్మానం చేయడంతో గ్రామంలో రాజకీయ పార్టీలు, గ్రామ పంచాయతీ, గ్రామ మహిళ సమాఖ్యలు మద్దతు ప్రకటించారు. దీంతో అనాడు నుంచి నేటి వరకు మద్యపానం గ్రామ గడప దాటకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. సింగోటం గ్రామంతో పాటు మండలంలోని మద్యపాన నిషేదం ప్రకటించిన గ్రామాల్లో మూడున్నాళ్ల ముచ్చటగా మిగిలి పోతే సింగోటం గ్రామం మాత్రం నేడు మండలంలోని గ్రామాలకే కాక రాష్ట్రంలో ఆదర్శ గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో మద్యపాన నిషేదం కోసం గ్రామ యువకుల కష్టం నేడు సత్ఫలి తాలను ఇస్తోంది.

ఆధ్యాత్మిక గ్రామం..

సింగోటం అంటే గోవిందా నామస్మరణ శ్రీవారి సముద్రం కింద ప్రకృతి ప్రసాదించిన పంట పొలాలు, ఆహ్లాదకమైన పర్యాటకం మనుకు గుర్తుకు వస్తోంది. కానీ దశాబ్ది కాలం ముందు సింగోటం అంటే మద్యం, ఘర్షణలు గుర్తుకు వచ్చేవి. 100పైగా మద్యపాన స్థావరాలు ఉన్న సింగోటం నేడు ఆధ్యాత్మిక కేంద్రాలతో, పర్యాటక కేంద్రాలతో అందంగా ఉంది. ఐదువేల జనాభా కల్గిన సింగోటం గ్రామానికి నాడు వ్యవసాయంతో పాటు కూలి పని మాత్రమే ప్రధాన వనరుగా ఉండేది. నేడు సింగోటం ఆధ్యాత్మిక, పర్యాటక గ్రామంగా వృద్ధి చెందడంతో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడ్డాయి. లక్ష్మి నరసింహస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు కూడా సింగోటం గ్రామంలో జరిగిన మార్పును చూసి సంతోషిస్తున్నారు. సింగోటం గ్రామం మరిన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండాలని ఆంకాక్షిస్తున్నారు.

గ్రామ యువకుల పాత్ర..

పది సంవత్సరాల క్రితం సింగోటం గ్రామంలో మద్యపాన నిషేదం అమలు కోసం యువకులు చాలా కష్టపడాల్సి వచ్చింది. రాత్రి కంటికి నిద్ర లేకుండా గ్రామంలోకి వస్తున్న సారా రవాణాను అడ్డుకున్నారు. అప్పుడు అనేక సమస్యలు వచ్చాయి. అయినా అధిగమించి సంపూర్ణ మద్యపాన నిషేద గ్రామంగా తీర్చిదిద్దుకున్నారు. అప్పటికష్టం నేడు ఫలితాలను ఇస్తోంది. గ్రామంలో చదవుకుంటున్న పిల్లల సంఖ్య పెరిగింది. ఆర్థిక పరిపుష్టి కూడా సాధ్యమయింది.

అధైర్య పడొద్దు అండగా ఉంటా..

● మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఫిబ్రవరి 26: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని.. ఆధైర్య పడొద్దని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నాయినోనిపల్లి మాజీ సర్పంచ్ చిన్నచెన్నయ్య తమ్ముడు సత్యయ్య, ఇబ్రహీంబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి యాదయ్య నాన్నమ్మ నర్సమ్మ మృతిచెందారు. మాజీ మంత్రి బుధవారం వారి సంకుచిత మనస్థత్వాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రపంచ మేధావి చిత్రపటాన్ని తిసివేయడం సహించమని, తిరిగి చిత్రపటాన్ని యదాస్థితిలో పెట్టాలని, లేకపోతే స్వేరో ద్వారా ఆందోళన చేపడుతామని ఆయనన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, చెన్నయ్య, జంబులయ్య, బసిరెడ్డి, కురుమూర్తిగౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ లీకేజీలను అరికట్టాలి

కొల్లాపూర్, ఫిబ్రవరి 26: స్థానిక మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో కొద్ది రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ కొనసాగుతుందని, లీకేజీలను అరికట్టడంలో మాత్రం అధికారులు అలసత్వం వహిస్తున్నారని బీఆర్ఎస్ దళిత విభాగం నాయకులు కుమార్ మాదిగ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని మూడోవార్డులో జరిగిన లీకేజీలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి లీకేజీలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బాలానగర్(రాజాపూర్), ఫిబ్రవరి 26: రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుందుబీ వాగులోంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం మధ్యాహ్నం పట్టుకున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు. మండలంలోని నందిగామకు చెందిన గొడుగు వంశీ, పాల్కొండ శివకుమార్ ముదిరెడ్డిపల్లి, నందిగామ మధ్య రైల్వేవంతెన సమీపంలోని వాగులోంచి మధ్యాహ్నం 1:30 గంట ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

భూత్పూర్, ఫిబ్రవరి 26: పట్టణంలోని మునిరంగస్వామి ఆలయం వెనుక మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలు మండలంలోని కొత్తమొల్గరకు చెందిన రంగమ్మ(50) కల్లుకు బానిసై మంగళవారం ఇంటినుంచి వెళ్లింది. రాత్రి ఎవరో బండరాయితో కొట్టి చంపినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పండ్లు పంపిణీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26: జిల్లాకేంద్రంలోని పెద్దశివాలయంలో బుధవారం మారుతి అప్పగౌలి, భీమప్ప బైర్‌వాడి, వాండ్ల సచిన్, రాజు బైర్‌వాడే ఆధ్వర్యంలో ఉపావాస దీక్షలో ఉన్న భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. బైర్‌వాడి వంశీయులు గౌలి కిశోర్, గౌలి మదన్, దిలీప్‌గౌలి, వెంకట్ బైర్‌వాడి కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ అభినందించారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి, మరొకరికి గాయాలు

అరుణ్ మృతదేహం

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని నడింపల్లికి చెందిన అరుణ్ (28) యువకుడు తన స్నేహితుడితో కలిసి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని శ్రీశైలం దైవదర్శనానికి తన బైక్ పై బయలుదేరగా దోమల పెంట సమీపంలోని హైదరా బాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వైపు నుంచి తిరిగి వెళ్తుండగా అచ్చంపేట నుంచి శ్రీశైలం వెళ్తున్న యువకుల బైక్ ముందర వస్తున్న ఆటోను తప్పించడానికి వెళ్లి ఎదురుగా వస్తున్న బస్సు ఓవర్‌టేక్ చేస్తు బస్సు టైరు కింద పడడంతో అరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక సీటులో కుర్చున్న మరో యువకుడికి గాయాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దోమల పెంట పోలీసులు కేసున మోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రవెల్లిలో గడ్డివాము దగ్ధం

చారకొండ, ఫిబ్రవరి 26: మండలంలోని ఎర్రవెల్లికి చెందిన రైతు పబ్బు నాగయ్య తన వ్యవసాయ పొలంలో ఉన్న గడ్డివాము బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసినట్లు బాధిత రైతు తెలిపారు. గడ్డి విలువ రూ.70 వేలు ఉంటుందని రైతు పేర్కొన్నారు. పశుగ్రాసం పూర్తిగా దగ్ధం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

ఊర్కొండ: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయానికి చారగొండ మండలం తిమ్మాయిపల్లికి చెందిన రంగినేని అనిల్‌రావు దంపతులు బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ. లక్ష చెక్కును ఆలయ ఆర్చకులు శ్రీనివాస్ శర్మాకు అందజేశారు. కార్యక్రమంలో రంగనేని సబిత నిర్మల్‌రావు, రేణుక కమలాకర్‌రావు పాల్గొన్నారు.

లక్ష రూపాయల చెక్కు అందిస్తున్న భక్తులు

ముగిసి బాస్కెట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 26: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ సెలక్షన్ ట్రాయల్స్ బుధవారం ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి బాలుర విభాగంలో 110మంది క్రీడాకారులు హాజరుకాగా 25 మంది ఎంపికయ్యారు. కాగా బాలికల విభాగంలో 80 మంది క్రీడారులు హాజరుకాగా 20 మంది ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పుదుచ్చేరిలో ఏప్రిల్ 9 నుంచి 16 వరకు జరిగే 40వ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో క్రీడాసంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి నసురల్లా హైదర్, న్యాయవాది మనోహర్‌రెడ్డి, సుభాన్‌జీ, ఫారుక్ ముఖరం, గోపాల్, అర్షద్ అలీ, ఇలియాజ్ పాల్గొన్నారు.

ఎంపికలో పోటీపడుతున్న బాలుర క్రీడాకారులు

ఆత్మకూర్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

అమరచింత, ఫిబ్రవరి 26 : వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆత్మ కూర్ పట్టణంలో చెర్ల పరమేశ్వస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లాల స్థాయిలో జాతర మైదానంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని జాతర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటనర్సింగరావు, ప్రధాన కార్యదర్శి మణివర్ధన్‌రెడ్డి వెల్ల డించారు. ఈ సందర్భంగా వారు బుధవారం ఆత్మకూర్ ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. మొదటిరోజు సాయంత్రం 5గంటలకు పల్ల కీవతో జాతర ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభం చేసేందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు పలు వురు ప్రముఖులు హాజరవుతారని, మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు. మూడోబహుమతి రూ.10వేలు, నాలుగో బహుమతిగా రూ.5వేల నగదును అందజేస్తామని తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను 28 ఫిబ్రవరి లోపు నమోదు చేసుకునేందుకు 9494019675, 8499898925 నెంబర్లును సంప్రదించాలని సూచించారు. కమిటీ సలహాదారులు పరమేశ్, రహిమాతుల్లా, సభ్యులు సాయి రాఘవేంద్ర, నాగేశ్, పూజారి కరిబసయ్య పాల్గొన్నారు.

'పాగ' చుట్టిన మల్లన్న

● వరుడైన నీలకంఠుడు

శ్రీశైలం ఫిబ్రవరి 26: శ్రీశైలంలో మహాశివరాత్రి పర్వదినాన మల్లన్నను వరునిగా చేసే పాగాలంకరణ ఘట్టం వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయ ప్రాంగణంలో చేరుకున్నారు. మహా శివరాత్రి రోజు జరిగే ప్రధాన ఘట్టాల్లో పాగాలంకరణ, లింగోద్భవ కాల ప్రత్యేక పూజలు, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు ఆలయ ప్రవేశం చేసేందుకు వివిధ ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా పాగాలంకరణ, కల్యాణంలో పాల్గొనే వీఐపీ పాస్‌లతో పాటు సామాన్య భక్తులకు అవకాశం కలిగించామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

పాగాలంకరణ..

లింగోద్భవ కాలపూజలు

శ్రీశైలేశుని వరునిగా చేసే అద్భుత ఘట్టమే పాగాలంకారం. ఈ పాగాసు ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుమారుడు సుబ్బారావు శివరాత్రి కల్యాణానికి స్వామివారి సువర్ణ గర్భాలయ కళశంపై నుంచి నవనం దుస్తులు కలుపుకుంటూ ప్రత్యేక ఆకృతిలో అలంకరించారు. మరోవైపు లింగోద్భవ సమయంలో గర్భాలయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఆధ్వర్యంలో 11మంది నిష్ణాతులైన వేదపండితులు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.

శోభాయమానంగా ప్రభోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున ప్రభోత్సవం శోభాయమానంగా కొనసాగింది.

గంగాధర మండపం నుంచి ప్రారంభమై నందిమండపం వరకు సాగిన ప్రభలో వేలాది భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకొని తన్మయత్వం పొందారు. నందివాహనంపై స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. నందివాహన సేవలో భ్రామరి సమేత మల్లికార్జునుడు



నందివాహన సేవలో భ్రామరి సమేత మల్లికార్జునుడు

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

వెల్దండ/తిమ్మాజీపేట/తాడూరు/బిజినేపల్లి/ కోడేరు/ పెద్దకొత్తపల్లి/కల్వకుర్తి/లింగాల/ ఉప్పునుంతల/చారకొండ/ ఫిబ్రవరి 26: నాగర్ కర్నూల్ జిల్లా వివిధ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శివరాత్రిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా శివాలయాల్లో వేదపండితులు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వెల్దండ మండలంలోని గుండాలలో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, వెల్దండ బ్రహ్మగిరి ఆలయంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమామహేశ్వర క్షేత్రంలో శివరాత్రి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు సతీమణి, జీబీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గువ్వల అమల బుధవారం పరమ శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పునుంతల మండలంలోని కేదారేశ్వాలయంలో గ్రామానికి చెందిన దాత కొత్త జంగిరెడ్డి మహాశివరాత్రి సందర్భంగా 116 దీపాలతో దీపోత్సం నిర్వహించారు. చారకొండ మండలం సిరుసనగండ్ల సీతారామ చంద్రస్వామి ఆలయం లో భక్తులు ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అమ్రాబాద్ శ్రీ అమరేశ్వరాలయంలో..

ఉమామహేశ్వర క్షేత్రంలో పూజలు చేస్తున్న జీబీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గువ్వల అమల

దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, ఫిబ్రవరి 26:మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణాలలో వ్యాపారాలు చేసుకునేందుకు వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీకి వ్యాపారాల నిమిత్తం దుకాణాలు నిర్మించినట్లు ఆయన చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే వ్యాపారాలు చేసుకునే వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మహిళా సంఘాల వారికి ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని కమిషనర్ వివరించారు. ఈ నెల 27నుంచి మార్చి 3వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కమిషనర్ చెప్పారు.

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ సందర్శనను అడ్డుకోవడం తగదు

బీఎస్పీ నాయకులను అడ్డుకుంటున్న దృశ్యం

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 26: ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ సందర్శనను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం తగదని బీఎస్పీ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న అన్నారు. బీఎస్పీ అధ్యక్షుడు ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు సందర్శనకు పార్టీ ప్రతినిధుల బృందం బుధవారం వెళ్లారు. బీఎస్పీ ప్రతినిధుల బృందాన్ని పోలీసులు గేటు వద్దనే అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, కల్యాణ్, పరశురాం, నాగేశ్, మధు, రాజు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లీ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో జీవితాలను అనుభవిస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

పెద్దకొత్తపల్లి వాసికి డాక్టరేట్

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని యాపట్ల గ్రామవాసి పబ్బతి కృష్ణ బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. బయో టెక్నికల్ జనటిక్ విభాగంలో థీరిని ప్రొఫెసర్ రోజా రాణికి అంద జేశారు. ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ పొందిన పబ్బతి కృష్ణను గ్రామస్తులు అభినందించారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి భూమిపూజ

వెల్దండ, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని పెద్దాపూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ.. రూ. 5లక్షలు ఎమ్మెల్యే నిధులతో డ్రెయినేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, అనిల్, రాములు, సుధాకర్, కృష్ణయ్య, రవీందర్ గౌడ్, శివ, ధనుష్ ఉన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

ధన్వాడ, ఫిబ్రవరి 26: మండలంలో చాలామంది నిరుపేదలు రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ సుధీర్‌కుమార్ రావు కోరారు. బుధవారం ఆయన ధన్వాడలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి నిరుపేదలకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని చెప్పిందని.. 2013లో దరఖాస్తు చేసుకున్న వారికి కాకుండా ఇటీవల జరిగిన ప్రజాపాలన గ్రామసభలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ కూడా రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు.

గుట్టపై జ్యోతి వెలిగించడం ఆనవాయితీ

ఖిల